క్లుప్తంగా

9న మండల సర్వసభ్య సమావేశం

సీతారామపురం : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన జరిగే సమావేశంలో తాగునీరు, విద్య, వ్యవసాయం, ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



సీతారామపురం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఎంఈఓలు మస్తాన్‌వలీ, ప్రవీణ పాఠశాలల హెచ్‌ఎంలకు పుస్తకాలను అందజేశారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.315

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.315 పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 889 బేళ్లను తీసుకురాగా, 753 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.315, కనిష్ఠంగా రూ.80, సరాసరిన రూ.229.26 ధర పలికిందని వేలం కేంద్రం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

డీసీపల్లిలో 894 బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 894 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1056 బేళ్లు రాగా, 894 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.315, కనిష్ఠంగా రూ.75, సగటున రూ.209.31 ధర పలికిందని వివరించారు.

6,7న మండల స్థాయి క్రీడా పోటీలు



ఉదయగిరి: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను ఈ నెల 6,7 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎంఈఓ టీ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 6న అథ్లెటిక్స్, వాలీబాల్, చెస్, 7న కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా, ఖోఖో పోటీలు జరుగుతాయని తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అండర్–14, 17 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 6వ తేదీ ఉదయం 9గంటల్లోపు ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకోవాలని కోరారు. వివరాలకు వ్యాయమ ఉపాధ్యాయులు ప్రసాద్, రియాజ్‌ను 63007 46554, 94419 86879 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉపాధి శిక్షణ

ఉదయగిరి రూరల్: కేంద్ర ప్రభుత్వ పీఎం అజయ్ పథకం కింద నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉచితంగా ఉపాధి శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నామని ఉదయగిరిలోని న్యాక్ కార్యాలయ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటలో తెలిపారు. 17 ఏళ్లు నిండిన వారికి రోజుకు నాలుగు గంటలు చొప్పున రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. తద్వారా ఉద్యోగావకాశాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు అభినందన



కావలి(అల్లూరు): కావలిలోని వెంగళరావునగర్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి బండి మహిల్ ఎన్‌సీసీ ట్రెక్కింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తిచేశారు. ఎన్‌సీసీ పదో ఆంధ్ర నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు పది రోజుల పాటు అరకు వ్యాలీలో ట్రెక్కింగ్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ఎంపికైన మహిల్ శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకుని రావడంతో ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి, ఉపాధ్యాయులు ఫాహిముద్దీన్, సరళకుమారి, విజయలక్ష్మి, భాగ్యమ్మ, సృజన, వాసవి, జనార్దన్, రాజా, నాగలక్ష్మి, లావణ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

మేం వచ్చిందే సమయం



రొంపిదొడ్ల సచివాలయంలో కనిపించని సిబ్బంది



వేంపాడు సచివాలయంలో అరకొరగా ఉన్న సిబ్బంది

- గ్రామసచివాలయాలపై కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- సమయాన్ని పాటించని సిబ్బంది
- సర్వేల పేరుతో అందుబాటులో ఉండని వైనం
- సేవలు అందక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వరికుంటపాడు: గ్రామసచివాలయ సిబ్బంది సమయాన్ని పాటించడం లేదు. గ్రామసచివాలయాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాల్సి ఉన్నా ఎప్పుడుంటారో తెలియడం లేదు. సర్వేల పేరుతో బయటే ఎక్కువగా కాలక్షేపం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో 12 సచివాలయాలు ఉండగా వివిధ విభాగాలకు సంబంధించిన 75 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో ఎక్కువ మంది సమయాన్ని పాటించడం లేదు. ఉదయం పదిన్నర గంటలకు విధులకు హాజరుకావాల్సి ఉండగా, 11 గంటల వరకు కూడా రావడం లేదు. విధులకు హాజరైన వారు కూడా సచివాలయాల్లో అందుబాటులో ఉండడం లేదు. సచివాలయంలో ఒక్కో ఉద్యోగి మాత్రమే ఉంటున్నారు. ఎవరైనా వెళ్లి అడిగితే సర్వేలకు వెళ్లారని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో కూడా ఉండడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సచివాలయ సిబ్బంది సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలి. బయటకు వెళితే మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. కానీ సచివాలయాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం హాజరు వేసుకుని మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయకుండానే బయటకు వెళ్తున్నారు. దీంతో వివిధ సేవల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సిబ్బందిని కుదించడంతో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయంలో అన్ని విభాగాలకు సంబంధించి 8 నుంచి 10 మంది వరకు సిబ్బంది ఉండేవారు. ఏ సచివాలయం పరిధిలో ఉండే జనాభా సమస్యలను అక్కడే పరిష్కరించే పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక క్లస్టర్ల పేరుతో సిబ్బందిని సర్దుబాటు చేసి కుదించింది. ప్రస్తుతం గ్రామవ్యవసాయ సహాయకులు రెండు సచివాలయాలకు ఒకరు ఉన్నారు. వారు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియడం లేదు. అలాగే సర్వేయర్లు కూడా రెండు సచివాలయాలకు ఒకరు ఉండడం..రీసర్వేల పేరుతో ఎక్కువగా బయటే ఉంటుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు లేక సేవలు అందడం లేదు. దీంతో సమీపంలోని సచివాలయాలు, వరికుంటపాడులోని మీసేవ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

డిజిటల్ అసిస్టెంట్ లేరు



మా సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేరు. దీంతో ఏమైనా సేవలను మీసేవకు వెళ్లి పొందాల్సి వస్తోంది. వెల్ఫేర్, ఎనర్జీ అసిస్టెంట్లు లేకపోవడంతో వారి సేవలను పొందలేకపోతున్నాం. జీ కొండారెడ్డిపల్లి క్లస్టర్‌గా ఉండడంతో గ్రామవ్యవసాయ సహాయకుల సేవలను పొందలేకపోతున్నాం.

–మాగంటి శ్రీనివాసులు, తూర్పుబోయమడుగుల

ఇబ్బందులు పడుతున్నాం



మా సచివాలయంలో డిజిటల్, ఎనర్జీ, సర్వేయర్, అగ్రికల్చరల్, వెటర్నరీ అసిస్టెంట్లు లేరు. ముఖ్యంగా వెటర్నరీ, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు లేని కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–దేవరకొండ బాలకృష్ణ, వెంగమాంబపురం

చర్యలు తీసుకుంటాం

సచివాలయ సిబ్బంది సమయాన్ని పాటించాలి. సచివాలయం నుంచి బయటకు వెళితే మూమెంట్ రిజిస్టర్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలి. సచివాలయాలను తనిఖీ చేసి సమయాన్ని పాటించని, మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయని సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. క్లస్టర్లను చేసి సిబ్బందిని సర్దుబాటు చేయడంతో సిబ్బంది కొరత ఉంది. భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

–డీవీ రమణారెడ్డి,ఎంపీడీఓ

క్రీడలతో మానసికోల్లాసం



పావురాన్ని ఎగురవేసి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ

మర్రిపాడు: క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని ఎంఈఓ తిరుపతయ్య పేర్కొన్నారు. మర్రిపాడు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంఈఓ తిరుపతయ్య పావురాన్ని ఎగురవేసి క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యో అవకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం అండర్–14,17 బాలుర, బాలికలకు అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఆదివారం షటిల్, టెన్నికాయిట్, యోగా, ఖోఖో తదితర అంశాల్లో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. తొలుత క్రీడల ప్రారంభ సూచికగా క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్, కేజీబీవీ, మర్రిపాడు ఉన్నత పాఠశాలల విద్యార్థుల స్వాగత నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు పద్మలత, రవీంద్ర, కలిశెట్టి రాజేంద్రకుమార్, మర్రిపాడు ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రమణయ్య పీడీలు హరినాథ్, బాబు, మనోజ్, పద్మ, అఫ్రోజ్, సీఎంఆర్టీలు శ్రీనివాసులు, కస్తూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అల్లూరు: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి



కలిగిరి మండలం తూర్పుమాలపాళెంలో..

అల్లూరు: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు.మండలంలోని పురిణికొత్తపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవ కార్యక్రమంలో శనివారం ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల్లో స్థూలకాయం నివారణ, బాల్యదశ సంరక్షణపై అవగాహన కల్పించారు.

కలిగిరి: మండలంలోని చిన్నఅన్నలూరు పంచాయతీ పరిధిలోని తూర్పుమాలపాళెం ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాముఖ్యత, లోపంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం షేక్ అమీర్‌బాషా, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు ఎస్ ఉమామహేశ్వరి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

సోమశిల: చేజర్ల మండలం మాముడూరు పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ దాచూరి చిన్నయ్య డీపీఓ, కలెక్టర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–2025 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ అభివృద్ధికి సంబంధించి పాలకవర్గం ఆమోదించిన తీర్మానాలను టీడీపీ నాయకుడు తాళ్లూరి గిరినాయుడు మాటలు విని పంచాయతీ కార్యదర్శి వై శీనయ్య అమలు చేయకుండా నిలిపివేశారని తెలిపారు. ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించగా సెప్టెంబర్ 27వ తేదీలోగా నిలిపివేసిన తీర్మానాలను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయినా హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి తీర్మానాలను ఆమోదించలేదన్నారు. టీడీపీ నాయకుల అడుగుజాడల్లో నడుస్తూ పంచాయతీ పాలకవర్గం ఆమోదించిన తీర్మానాలను అమలు చేయకుండా పంచాయతీ అభివృద్ధికి తూట్లు పొడుస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాళికాదేవి త్రిగుణాతీతురాలు



సంగం: స్థానిక తిరుమనకొండ రాజరాజేశ్వరీదేవి జ్ఞానపీఠంలో లోక కళ్యాణం కోసం 45 రోజుల పాటు నిర్వహిస్తున్న లలితారుద్ర మహాయజ్ఞం శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి భక్తులకు అమ్మవారి కాళికాదేవి అవతారాన్ని వివరించారు. అమ్మవారి దశ మహావిద్యల్లో కాళికాదేవి మొదటి విద్య అన్నారు. త్రిగుణాతీతురాలు, పరబ్రహ్మ స్వరూపిణి, యోగినిదేవి అయిన అమ్మవారి రూపాన్ని స్మరిస్తే ఇంద్రియ నిగ్రహం మనశ్శాంతి లభిస్తాయన్నారు.

నుడా నిధులతో అభివృద్ధి పనులు

ఉదయగిరి: నుడా నిధులతో ఉదయగిరిలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయగిరిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నుడా నిధులు రూ.1.50 కోట్లతో వింజమూరులో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంగం బ్యారేజ్‌కు వరద తగ్గుముఖం



సంగం: సంగం బ్యారేజ్‌కు వరద తగ్గుముఖం పట్టింది. సోమశిలకు వరద ప్రవాహం తగ్గడంతో దిగువకు నీటి విడుదలను అధికారులు తగ్గించారు. దీంతో సంగం బ్యారేజ్‌కు వరద ప్రవాహం తగ్గింది. దీంతో బ్యారేజ్ నుంచి దిగువకు నీటి విడుదలను ఇరిగేషన్ అధికారులు తగ్గించారు.

యూరియా కొరతపై సర్పంచ్‌ల నిలదీత



యూరియా కొరతపై ఏఓను నిలదీస్తున్న సర్పంచ్‌లు

కలిగిరి: యూరియా కొరతపై టీడీపీ మద్దతు సర్పంచ్‌లు వ్యవసాయాధికారి జహీర్‌ను నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీషారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. తొలుత మండలాధికారులు శాఖలవారీగా ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ఏఓ జహీర్ మాట్లాడుతూ ప్రస్తుతం యూరియా కొరత ఉన్న కారణంగా పంటలకు వినియోగాన్ని తగ్గించాలని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఇందుకు టీడీపీ మద్దతు సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, సుబ్బానాయుడు స్పందిస్తూ యూరియా కొరతపై నిలదీశారు. యూరియాను పంటలకు తగ్గించి వాడితే దిగుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. మండలానికి ఎంత యూరియా వచ్చింది.. ఎంత మందికి పంపిణీ చేశారో చెప్పాలని నిలదీశారు. ఎంపీపీ మాట్లాడుతూ కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్ సక్రమంగా విధులు హాజరుకావడం లేదని ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. గత రెండు మండల సమావేశాల్లో హెచ్చరించినా అతని తీరు మారకపోవడం బాధాకరమన్నారు. వైద్యాధికారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి, వైస్ ఎంపీపీ పొన్నం రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ధర్నా జయప్రదానికి పిలుపు



పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ఆత్మకూరురూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల 7న విజయవాడలో ధర్నాను చేపడుతున్నట్లుగా ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు అల్లంపాటి సురేంద్రరెడ్డి, సోమవరపు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఉపాధ్యాయ సంఘాల నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని, 12వ పీఆర్సీని నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, సీపీఎస్ రద్దు, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన, పెండింగ్ బకాయిల చెల్లింపు, తదితర డిమాండ్ల సాధనకు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

19న మాదిగల మహాసభ



మాట్లాడుతున్న అంబేడ్కర్‌మాదిగ

వింజమూరు(ఉదయగిరి): నెల్లూరులో ఈ నెల 19న మాదిగల మహాసభను నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్‌మాదిగ తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ స్థాయి మాదిగల సమావేశాన్ని వింజమూరులో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల అభ్యున్నతి కోసం ఎమ్మార్పీస్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. మాదిగల హక్కుల కోసం 30 ఏళ్ల పాటు పోరాటం చేసి సాధించుకున్న ఫలాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా మహాసభకు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా మహాసభకు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు, మంద వెంకటేశ్వరరావు, గోచిపాతల వెంకటేశ్వర్లు, మంద సుజాత, బెజవాడ బాలగురవయ్య, గొల్లపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం



ఏపీఓను నిలదీస్తున్న సర్పంచ్ గోపి

కొండాపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. తొలుత మండలాధికారులు శాఖలవారీగా ప్రగతిని చదివి వినిపించారు. ఉపాధి ఏపీఓ మురళీధర్ ఉపాధి పనుల పురోగతిని వివరిస్తుండగా మర్రిగుంట సర్పంచ్ దార్ల గోపి జోక్యం చేసుకుని పంచాయతీ తీర్మానం లేకుండా ఉపాధి పనులు ఎలా చేపడుతారని నిలదీశారు. పంచాయతీలో 234 జాబ్‌కార్డులు ఉండగా, ఇద్దరు వ్యక్తులకు ఎలా లాగిన్ ఇస్తారని ప్రశ్నించారు. గ్రామానికి చెందిన అంకబాబు 2007 నుంచి ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పని చేస్తుండగా, అధికార పార్టీ నాయకులకు తలొగ్గి కొత్తవారికి ఎలా లాగిన్ ఇస్తారని నిలదీశారు. మేజర్ పంచాయతీ సాయిపేటలో 1600 జాబ్ కార్డులు ఉన్నా ఒక్క ఫీల్డ్‌అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. మర్రిగుంటలో సర్పంచ్ అయిన తనకు తెలియకుండా పనులు చేయడం, తీర్మానాల మీద తన సంతకం లేకుండా వేరే వ్యక్తికి ఫీల్డ్‌అసిస్టెంట్ లాగిన్ ఎలా ఇస్తారని నిలదీశారు. అంగన్‌వాడీకార్యకర్త సక్రమంగా విధులు నిర్వహించకపోవడంపై తాము అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలకు అన్యాయం జరుగుతున్నా అధికార పార్టీ నాయకులకు అధికారులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే సమావేశం ముగిసిందని ఎంపీడీఓ వెళ్లిపోగా తాను కలెక్టర్‌ను కలవనున్నట్లు సర్పంచ్ తెలిపారు. అందుకు స్పందించిన ఎంపీడీఓ మర్రిగుంటలో మరో వ్యక్తికి ఎలాంటి లాగిన్ ఇవ్వలేదని, గతంలో పనిచేసే అంకబాబే ఫీల్డ్‌అసిస్టెంట్‌గా ఉన్నారని, జీతం కూడా అతనికే ఇవ్వడం జరుగుతుందని సమాధానం ఇచ్చారు.

క్రైమ్ కార్నర్

బొలెరోను ఢీకొన్న ఆటో..ముగ్గురికి గాయాలు



క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మర్రిపాడు: డీసీపల్లి టోల్‌ప్లాజా సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..డీసీపల్లికి చెందిన సురేష్ తన ఆటోలో ముగ్గురు పొగాకు కూలీలను తీసుకొని వెళ్తూ టోల్‌ప్లాజా సమీపంలో ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని అదుపుతప్పి వెనుకగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటోలోని ఉత్తర భారతదేశానికి చెందిన ముగ్గురు కూలీలు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో యువకుడికి..



సంగం: పెరమన వద్ద నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బుచ్చిరెడ్డిపాళెం మండలం పల్లాపోలుకు చెందిన తుపాకుల కరుణాకర్ ఉదయగిరి సమీపంలోని మామిడితోటలో కాపలాదారుడిగా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి స్వగ్రామం నుంచి ఉదయగిరికి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో మంత్రి ఆనం పర్యటన బందోబస్తుకు వెళ్లిన ఆత్మకూరు సీఐ గంగాధర్ గమనించి అనంతసాగరం ఎస్సై జీపులో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మానవత్వం చాటుకున్నారు.

కారు బోల్తా పడడంతో ఇద్దరికి..



మర్రిపాడు: బోల్తా పడిన కారు



వరికుంటపాడు: గేదెలను ఢీకొని దెబ్బతిన్న కారు

మర్రిపాడు: డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటన మండలంలోని చుంచులూరు వద్ద ఏర్పేడు జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..ప్రొద్దుటూరుకు చెందిన ఓ కుటుంబం కారులో పెంచలకోన క్షేత్రానికి వచ్చింది. దైవదర్శనం చేసుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో చుంచులూరు వద్ద డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు హైవే పక్కకు దూసుకెళ్లి సూచికబోర్డును ఢీకొని బోల్తా పడింది. కారులో నలుగురు పెద్దలు, ఇద్దరు చిన్నారులు ఉండగా, వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికుల సమాచారంతో బద్వేల్‌లోని ఆస్పత్రికి తరలించారు.

గేదెలను ఢీకొన్న కారు

వరికుంటపాడు: రామాపురం సమీపంలో 565వ నంబర్ జాతీయరహదారిపై శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..పామూరు నుంచి కోవూరు వైపు వెళ్తున్న కారు రామాపురం వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా గేదెలు అడ్డువచ్చాయి. దీంతో కారు ఢీకొని ఒక గేదె మృతి చెందగా, మరో గేదె గాయపడింది. కారు ముందు భాగంగా పూర్తిగా దెబ్బతింది. కారులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.